రాజకీయ లబ్ధి కోసమే కవిత అరెస్ట్: దిండిగాల

ఇల్లెందు, మార్చి 15: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ కలిసి ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేస్తున్నాయని బీఆర్ఎస్ నాయకుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. రాజ్యంగా వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని ప్రతిపక్ష నాయకురాలు కవితపై కేంద్ర ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతున్నదని విమర్శించారు. ప్రజాస్వామికవాదులు కవిత అరెస్ట్‌ను ఖండించాలని కోరారు.

కరకట్ట పనులు పరిశీలించిన ఎమ్మెల్యే తెల్లం

కరకట్ట పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం, మార్చి 15: భద్రాచలం గోదావరి ఒడ్డున రూ.39 కోట్లతో చేపడుతున్న కరకట్ట నిర్మాణ పనులను శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పరిశీలించారు. కాంట్రాక్టర్లు, సిబ్బందికి సలహాలు, సూచనలిచ్చారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకులు రత్నం రమాకాంత్, నర్రా రాము, నవాబ్, గాడి విజయ్, ఆకుల వెంకట్, పుల్లగిరి నాగేంద్ర, కావూరి గోపి ఉన్నారు.

శివాలయ 'శివరాత్రి' ఆదాయం రూ.8.19 లక్షలు

కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అన్నపురెడ్డిపల్లి, మార్చి 15: మండల కేంద్రంలోని బ్రమరాంబ సమేత శ్రీమల్లికార్జున స్వామి దేవాలయ హుండీ ఆదాయం రూ 3.49 లక్షలు వచ్చినట్లు ఆలయ మేనేజర్ వెంకటరమణ తెలిపారు. స్థానిక శివాలయంలో దేవాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ ఇన్‌స్పెక్టర్ బేల్‌సింగ్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది శుక్రవారం హుండీ కానుకలను లెక్కించారు. శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా షాపుల నిర్వహణకు రూ 1.38 లక్షలు, ఆర్జిత సేవలకు రూ.39 వేలు, కేశఖండనకు రూ.1020, దర్శనం టిక్కెట్లుకు రూ.1.58 లక్షలు, కల్యాణ కట్ను కానుకలుకు రూ.11 వేలు, హుండీ ఆదాయం రూ.3.49 లక్షలు, ఇతరత్రా ఆదాయం రూ.1.20 లక్షలు కలిపి మొత్తం ఆదాయం రూ.8.19 లక్షలు వచ్చినట్లు వివరించారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయండి: ఎంపీపీ

అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎంపీపీ జల్లిపల్లి

అశ్వారావుపేట, మార్చి 15: ప్రజా అవసరాల కోసం గత కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి కోరారు. మండలంలోని నారంవారిగూడెంలో రూ.4 లక్షలతో జరుగుతున్న 3 కల్వర్టుల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులకు అనుగుణంగా అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఈ అభివృద్ధి పనులను మంజూరు చేయించారని గుర్తుచేశారు. అయితే గత కేసీఆర్ ప్రభుత్వంలో మంజూరైన కొన్ని పనులను కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లామని, అభివృద్ధి పనులను అడ్డుకుంటే సహించబోమని ఆయన కూడా స్పష్టం చేశారని అన్నారు. బీఆర్ఎస్ నాయకులు తాడేపల్లి రవి, వగ్గెల పూజ, రఘురామ్, తదితరులు ఉన్నారు.

'క్రమశిక్షణతోనే భవిష్యత్ లక్ష్యాలు చేరుకుంటాం'

అశ్వారావుపేట, మార్చి 15: క్రమశిక్షణ ఉంటేనే భవిష్యత్ లక్ష్యాలను చేరుకుంటామని నారంవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం పున్నం చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సూచించారు. మండలంలోని నారంవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన వీడ్కోలు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఉపాధ్యాయులు రేణుక, బుల్లెమ్మ, శ్రీనివాసరెడ్డి, కాపుల హరినాథ్‌బాబు, రామారావు, సుజాత, రమేశ్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ

భూమిపూజ చేస్తున్న పినపాక ఎమ్మెల్యే పాయం

మణుగూరు టౌన్, మార్చి 15: కొండాయిగూడెం భ్రమరాంబ సమేత వైద్యనాథ లింగేశ్వరస్వామి ఆలయ సన్నిధిలో రూ.50 లక్షలతో చేపడుతున్న వసతి గృహం, డైనింగ్ హాల్ పనులకు శుక్రవారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో నాయకులు అయోధ్యాచారి, సతీష్, రమేశ్ పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: ఎంఈవో

అశ్వారావుపేట టౌన్, మార్చి 15: మండలంలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈవో కృష్ణయ్య తెలిపారు. మొత్తం 3 పరీక్షా కేంద్రాల్లో 642 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఆయా పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. పరీక్షలకు ముగ్గురు చీఫ్ సూపరింటెండెంట్లు, ముగ్గురు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 21 మంది పర్యవేక్షకులను నియమించినట్లు వివరించారు. విద్యార్థులు పరీక్షలు మంచిగా రాసి మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

జూలూరుపాడు, మార్చి 15: స్థానిక హైస్కూల్, సెయింట్ ఆంటోనీ పాఠశాలలో ఏర్పాటు చేసిన టెన్త్ పరీక్షా కేంద్రాలను మండల విద్యాశాఖాధికారి గుగులోత్ వెంకట్ శుక్రవారం పరిశీలించారు. కనీస సదుపాయాలు కల్పించాలని సిబ్బందితో చెప్పారు.

వృద్ధురాలి ఇంటి నిర్మాణానికి బీఆర్ఎస్ నేత సాయం

దమ్మపేట, మార్చి 15: శిథిలావస్థలో ఉన్న ఓ నిరుపేద వృద్ధురాలి ఇంటికి మరమ్మతులు చేయించి, పైకప్పు వేయించి దాతృత్వం చాటుకున్నాడు బీఆర్ఎస్ నాయకుడు గారపాటి సూర్యనారాయణ. దమ్మపేట శివారులోని ఆదివాసీ నిరుపేద వృద్ధురాలు ఊకే ఈతమ్మ ఇల్లు శిథిలావస్థలో ఉంది. విషయం తెలుసుకున్న 'ఫీడ్ ద నీడ్' స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడైన గారపాటి సూర్యనారాయణ.. ఖమ్మం ఎంపీ నామా జన్మదినం సందర్భంగా రూ.32 వేలతో ఆ ఇంటికి మరమ్మతులు చేయించి సదరు వృద్ధురాలికి అప్పగించాడు. వెంకట్, జేమ్స్, పొట్టా వీరస్వామి, పర్శిక వినోద్ పాల్గొన్నారు.

రామయ్యకు సర్వాంగ స్వర్ణ కవచాలంకరణ

భద్రాచలం, మార్చి 15: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం అర్చకులు మూలవరులకు బెంగళూరుకు చెందిన భక్తులు రూ. 5 కోట్లతో తయారు చేయించిన సర్వాంగ స్వర్ణ కవచాలను అలంకరించారు. సుప్రభాత సేవతో పాటు ఇతర పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపించారు.

రాముని సేవలో వేములవాడ ఆలయ ఈవో

భద్రాద్రి రామయ్యను శుక్రవారం వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

'చిన్నపిల్లల్లో క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించాలి'

టేకులపల్లి, మార్చి 15: చిన్నపిల్లల్లో క్షయ వ్యాధి లక్షణాలను గుర్తించాలని స్వచ్ఛంద సంస్థ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ మనోహర్‌రెడ్డి అన్నారు. 14 ఏళ్లలోపు పిల్లల్లో క్షయ వ్యాధిని గుర్తించడం, చికిత్స అందించడం వంటి అంశాలపై వైద్య సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు సులానగర్ పీహెచ్‌సీలో శుక్రవారం నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. జిల్లా కో ఆర్డినేటర్ వై ప్రభాకర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పార్వతి, నోడల్ ఆఫీసర్ నాగుబండి వెంకటేశ్వర్లు, పోరండ్ల శ్రీనివాస్, విజయ, శకుంతల అనురాధ, నిర్మల, లక్ష్మి, సక్కుబాయి, యశోద, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

'ధరణి' సహా అన్ని దరఖాస్తులను
సత్వరమే పరిష్కరించాలి

- ముఖ్యమంత్రి ప్రజావాణి దరఖాస్తులపై నివేదిక ఇవ్వాలి
- అధికారుల సమావేశంలో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 15 (నమస్తే తెలంగాణ): ధరణి సహా అన్ని దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. వివిధ అంశాలపై ఆమె శుక్రవారం ఐడీవోసీ సేమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ధరణి ఫిర్యాదులను కూలంకశంగా పరిశీలించిన తర్వాత మాత్రమే సిఫారసు చేయాలన్నారు. దరఖాస్తులన్నింటినీ వారం రోజుల్లో పరిష్కరించాలని, ఎలాంటి పొరపాట్లు జరగడానికి వీల్లేదని ఆదేశించారు. తిరస్కరించిన వాటిని కారణాలతో చెక్ లిస్టులో నమోదు చేయాలన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మీ సేవా దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అభివృద్ధి పనులు, ప్రాజెక్టులకు భూసేకరణను పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రజావాణి దరఖాస్తులను రెండు రోజుల్లోగా పూర్తిచేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.22.69 కోట్లు

యూడైస్‌లో గుర్తించిన 697 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం రూ.22.69 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ ప్రియాంక తెలిపారు. కలెక్టరేట్ నుంచి శుక్రవారం పాఠశాలల హెచ్ఎంలు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, డీఆర్డీవోతో ఇతర ప్రభుత్వశాఖల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు.

18 నుంచి టెన్త్ ఎగ్జామ్స్: కలెక్టర్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, మార్చి 15: ఈ నెల 18 నుంచి జిల్లాలోని 73 కేంద్రాల్లో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు. డీఈవో వెంకటేశ్వరాచారి, ఎంపీడీవోలు, ఇతర అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

'ఆరోగ్యంపై శ్రద్ధ కలిగి ఉండాలి'

ఇల్లెందు రూరల్, మార్చి 15: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కలిగి ఉండాలని సూపర్‌వైజర్ కొమరమ్మ సూచించారు. పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా మండలంలోని 21 ఫిట్ ఏరియా అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీలు కారం పద్మ, అంజలిమేరి, ఉమ, సుమతి, శ్రీలత పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి 25 క్వింటాళ్ల బియ్యం వితరణ

భద్రాచలం/ సారపాక, మార్చి 15: భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం సారపాక ఐటీసీ పీఎస్పీడీ యాజమాన్యం 25 క్వింటాళ్ల బియ్యాన్ని వితరణగా అందించింది. ఈ సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి ఐటీసీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం

కరకగూడెం, మార్చి 15: నిత్యం మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజమణి అన్నారు. అనంతరం అంగన్‌వాడీలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లతో నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. అనంతరం గర్భిణులు, బాలింతలతో ప్రతిజ్ఞ చేయించారు.

ఐటీఐ కోర్సుపై అవగాహన

మణుగూరు టౌన్, మార్చి 15: మణుగూరు ప్రభుత్వ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ జి.రవికుమార్ ఐటీఐ కోర్సుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని, నాగశ్రీ, ఐటీఐ కళాశాల హెచ్ఎం ప్రభాకర్, ఏటీవో ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం

పాల్వంచ రూరల్, మార్చి 15: మండలంలోని పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారికి అర్చకులు శుక్రవారం పంచామృతాభిషేకం చేశారు. ఆలయం ఎదురుగాగల అమ్మవారి జన్మస్థలం వద్ద ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయంలోని మూల విరాట్‌కు పంచామృతాలతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజన మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు.

19న సంత వేలం

అశ్వారావుపేట టౌన్, మార్చి 15: అశ్వారావుపేట సంత నిర్వహణకు ఈ నెల 19న ప్రత్యేకాధికారి రాజీవ్‌కుమార్ నేతృత్వంలో వేలం నిర్వహించనున్నట్లు ఈవో హరికృష్ణ శుక్రవారం తెలిపారు. సంత నిర్వహణతోపాటు మార్కెట్ గదులను కూడా ఈ వేలం ద్వారా అద్దెకు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల వ్యాపారులు నిర్దేశిత డిపాజిట్ రుసుము చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు. పూర్తి వివరాల కోసం గ్రామ పంచాయితీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

పాల్వంచ, మార్చి 15: మున్సిపాలిటీ పరిధిలోని గుడిపాడులో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత మోక్ష వేంకటేశ్వర స్వామి కల్యాణం ఈ నెల 24న జరగనుంది. ఈ వేడుక ఆహ్వాన పత్రికను శ్యామల గోపాలన్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్, దేవాలయ నిర్మాణ దాత నల్ల రాంరెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. మున్సిపల్ కమిషనర్ స్వామికి, డీఎస్పీ సతీష్‌కుమార్‌కు, ప్రభుత్వ అధికారులకు, పట్టణ ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందించారు.

సొంతింటి పథకం అమలు చేయాలి

కొత్తగూడెం సింగరేణి, మార్చి 15: సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని కోరుతూ డైరెక్టర్ (పా) ఎన్‌వీకే శ్రీనివాస్‌కు సింగరేణి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు.

అక్రమంగా మట్టి తరలిస్తున్న వాహనాల మళ్లింపు?

పర్ణశాల, మార్చి 15: రామచంద్రాపురం నుంచి శుక్రవారం రాత్రి అక్రమంగా మట్టి తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లు, ఒక జేసీబీనీ దుమ్ముగూడెం రెవెన్యూ అధికారులు పట్టుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పట్టుకున్న వాహనాలను తహసీల్దార్ కార్యాలయానికి తరలించాల్సి ఉండగా మార్గమధ్యంలో రెవెన్యూ అధికారులు వాటిని వదిలివేసినట్లు స్థానికంగా చర్చ నడుస్తున్నది. అధికారుల లోపాయికారి ఒప్పందంతోనే వాహనాలను విడిచిపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సెంట్రల్ లైటింగ్ కోసం రోడ్డు విస్తరణ

- గత కేసీఆర్ ప్రభుత్వంలోనే రూ.5.75 కోట్లు మంజూరు
- తాజాగా మొదలుపెట్టిన ఆర్అండ్‌బీ శాఖ అధికారులు

నిర్మాణాలు కూల్చివేస్తున్న జేసీబీ

ములకలపల్లి, మార్చి 15: మండల కేంద్రమైన ములకలపల్లిలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం రోడ్డు విస్తరణ పనులు మొదలయ్యాయి. ములకలపల్లిలో సెంట్రల్ లైటింగ్ నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చొరవతో గత కేసీఆర్ ప్రభుత్వంలో అప్పట్లో రూ.5.75 కోట్లు మంజూరు చేసింది. అయితే అప్పట్లో అసెంబ్లీ ఎన్నికల కోడ్ కారణంగా పనులు నిలిచిపోయాయి. వాటిని ఇప్పుడు అధికారులు మొదలుపెట్టారు. ఫోర్‌లైన్ రోడ్డు, డివైడర్, సెంట్రల్ లైటింగ్, ఇతరత్రా పనులు జరుగనున్నాయి. 50 అడుగుల రోడ్డు నిర్మాణానికి మార్కింగ్ చేసిన ఆర్అండ్‌బీ అధికారులు.. 50 అడుగుల లోపలి కట్టడాలను, తాత్కాలిక షెడ్లను జేసీబీతో తొలగిస్తున్నారు.

వ్యవసాయానుబంధ రంగాలతో ఉపాధి

వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్

వ్యవసాయ కళాశాలలో శిక్షణ తీసుకుంటున్న మహిళా రైతులు

అశ్వారావుపేట, మార్చి 15: వ్యవసాయ అనుబంధ రంగాలతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వ్యవసాయ కళాశాల అసోషియేట్ డీన్ డాక్టర్ జే.హేమంత్‌కుమార్ స్పష్టం చేశారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయని అన్నారు. స్థానిక వ్యవసాయ కళాశాలను సందర్శించిన ములకలపల్లి మండలానికి చెందిన మహిళా రైతులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. పుట్టగొడుగుల పెంపకం, వానపాముల ఎరువు, జీవన ఎరువుల తయారీ ద్వారా మహిళా రైతులు నికర ఆదాయం పొందవచ్చని వివరించారు. కుటీర పరిశ్రమల ఏర్పాటు స్వయం ఉపాధికి దోహదపడుతుందని అన్నారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ పథకాలను కూడా అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పుట్టగొడుగుల పెంపకంపై డాక్టర్ శ్రీలత, వానపాముల ఎరువుల తయారీపై డాక్టర్ పావని, జీవన ఎరువుల తయారీపై డాక్టర్ పీ.రెడ్డి ప్రియ మహిళా రైతులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల శాస్త్రవేత్తలు డాక్టర్ జీ.గోపాలకృష్ణమూర్తి, డాక్టర్ దీపక్‌రెడ్డి పాల్గొన్నారు.

వస్తువు కొనుగోలుకు రసీదు తప్పనిసరి: రుక్మిణి

సమావేశంలో మాట్లాడుతున్న రుక్మిణి

కొత్తగూడెం టౌన్, మార్చి 15: వినియోగదారులంతా తాము కొనుగోలు చేసిన వస్తువులకు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి రుక్మిణి అన్నారు. కొత్తగూడెంలో శుక్రవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవంలో ఆమె మాట్లాడారు. వినియోగదారులు తమ సమస్యలపై ఫోరంలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. తూనికలు-కొలతల శాఖ అధికారి మనోహర్ మాట్లాడుతూ... వస్తువు తూకాన్ని వినియోగదారులు నిశితంగా పరిశీలించాలన్నారు. వ్యాపారులు తమ తూనికలు కొలతల పరికరాలకు సకాలంలో ముద్ర వేయించాలన్నారు అధికారులు త్రినాథ్‌బాబు, సంపత్‌కుమార్, కరంచంద్, వినియోగదారుల హక్కుల సంస్థ బాధ్యులు గుగులోత్ బాలు రాజ్‌పుత్, రాజేశ్వరి పాల్గొన్నారు.

పశు సంపదను కాపాడేందుకే టీకాలు

'గాలికుంటు' టీకాల కార్యక్రమంలో ఇల్లెందు ఎమ్మెల్యే

టీకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కోరం కనకయ్య

టేకులపల్లి, మార్చి 15: పశు సంపదను కాపాడేందుకే పశు వైద్య, పశుసంవర్ధకశాఖలు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాయని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ బీ.పురంధర్ అధ్యక్షతన కోయగూడెంలో శుక్రవారం నిర్వహించిన పశువుల గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పశు వైద్యులు సంతోశ్‌కుమార్, రాజేశ్, ఎల్ఎస్ఏ పార్వతి, జేవీవో సాధిక, సిబ్బంది వెంకటేశ్వర్లు, జయమ్మ, రైతులు పాల్గొన్నారు.

'వ్యాధి నిరోధక టీకాలతోనే పశువులకు ఆరోగ్యం'

అశ్వారావుపేట, మార్చి 15: వ్యాధి నిరోధక టీకాలతోనే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సభ్యుడు చిన్నంశెట్టి వాసు అన్నారు. అందుకే ప్రభుత్వం టీకాలను ఉచితంగా అందిస్తోందని అన్నారు. మండలంలోని నారాయణపురంలో పశు వైద్య సిబ్బంది శుక్రవారం పర్యటించి పలు పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యాధి నిరోధక టీకాలు వేయకుంటే పాల దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టం వస్తుందని వివరించారు. పశు వైద్యాధికారి డాక్టర్ స్వప్న, సిబ్బంది మదార్ బక్షీ, రేఖారాణి, బాబ్జీ, అశోక్, దుర్గాభవాని, ధర్మ, రాము, పుల్లారావు పాల్గొన్నారు.

పంట మార్పిడితో లాభాలు: కేవీకే శాస్త్రవేత్తలు

రైతులకు అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కొత్తగూడెం అర్బన్, మార్చి 15: ప్రస్తుత యాసంగి సాగులో పంట మార్పిడితో లాభాలు పొందవచ్చని కేవీకే శాస్త్రవేత్తలు నవీన్, శ్రీనివాస్ చెప్పారు. మున్సిపాలిటీ పరిధిలోని చిట్టిరామవరం తండాలో శుక్రవారం అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఆయిల్‌పాం సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నందున రైతులు సన్నద్ధంగా ఉండాలన్నారు. తక్కువ నీటిని వినియోగించే చిరుధాన్యాల సాగుతో అధిక దిగుబడిని పొందవచ్చన్నారు. కౌన్సిలర్ భూక్యా శ్రీనివాస్, వ్యవసాయ అధికారులు గోపాలరావు, అనూష తదితరులు పాల్గొన్నారు.

'వ్యాధులపై అప్రమత్తత అవసరం'

అశ్వాపురం, మార్చి 15: ప్రజలు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి సంకీర్తన సూచించారు. కుమ్మరిగూడెం గుంపులో శుక్రవారం ఆమె వైద్యసిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మెడిసిన్ ఇచ్చారు. అనంతరం వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్య భద్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

'పోషకాహారం తీసుకోవాలి'

సారపాక, మార్చి 15: గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో ప్రమీల సూచించారు. తాళ్లగొమ్మూరు అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోషణ మాసోత్సవంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

బూర్గంపహాడ్, మార్చి 15: బూర్గంపహాడ్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు శుక్రవారం సురక్షిత వెల్ఫేర్ సొసైటీ సభ్యుడు గుదిగొండ్ల రవికుమార్ పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు 'బ్రిలియంట్' విద్యార్థులు

సారపాక, మార్చి 15: సారపాక బ్రిలియంట్ పాఠశాల విద్యార్థులు జి.రుత్విక్‌రామ్, జయభార్గవ్, దీపక్‌సాయి శ్రీరామ్‌తేజ్, పృథ్వీసాయిచరణ్‌రెడ్డి, నేత్ర నిఖిల్, అజయ్‌కుమార్, గౌతమ్ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి సీట్లు సాధించారని విద్యాసంస్థల చైర్మన్ బి.నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విద్యార్థులను అభినందించారు.

కిరాణా దుకాణాల్లో చోరీలు

అశ్వారావుపేట, మార్చి 15: పట్టణంలో గురువారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. జంగారెడ్డిగూడెం రోడ్డులో నాలుగు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. విక్టరీ మినీ సూపర్ మార్కెట్‌లోకి చొరబడిన దొంగలు సుమారు రూ.9 వేల నగదు, సెల్‌ఫోన్, దుర్గా సూపర్ మార్కెట్‌లో రూ.3 వేల నగదు అపహరించారు. అదేవిధంగా కూరగాయల దుకాణంలోనూ, మరో కిరాణా షాపులోనూ చోరీకి యత్నించారు. అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో దొంగతనం జరిగినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ద్వారా తెలుస్తోంది. శుక్రవారం ఉదయం దుకాణాలు తెరిచేందుకు వచ్చిన యజమానులు దొంగలు చొరబడినట్లు నిర్ధారించుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై శ్రీరాముల శ్రీను ఘటనా స్థలాలను పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్‌తో తనిఖీలు నిర్వహించారు. బాధితుల పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ ఫోన్ రికవరీ

టేకులపల్లి, మార్చి 15: నెల క్రితం పోయిన సెల్‌ఫోన్‌ను పోలీసులు రికవరీ చేసి శుక్రవారం బాధితుడికి అప్పగించారు. టేకులపల్లి ఎస్సై సైదా రవూఫ్ కథనం ప్రకారం.. సులానగర్ గ్రామానికి చెందిన గుగులోత్ మోతీలాల్ నెలరోజుల క్రితం ఇల్లెందుకు బైక్‌పై వెళ్తున్న క్రమంలో మొబైల్ ఫోన్ పోయింది. అతడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం